## కథ

**-ఎస్.ఘటికాచలరావు**

# వంట కోసమే...

"శాస్త్రులుగారూ, ఎలాగైనా ఈ సంవత్సరం వాడి పెళ్లి చేసెయ్యాలన్నదే నా ఆశ. వాడికేం అన్నీ వద్దు, వద్దు అనే అంటాడు. మనం పెద్దవాళ్లం, పిల్లల బాగోగులు చూడాల్సింది మనమే కదా. అందువల్ల ఏదో ఒకటి చూడండి. పిల్ల కాస్త అణకువగా ఉంటే చాలు"

"మీరు నిశ్చింతగా ఉండండి. దివ్యమైన సుగుణాలరాశిని మీ ఇంటి కోడలిని చేస్తాను. అమ్మాయి పెద్ద చదువే చదివింది. యూనివర్సిటీ ఫస్టుకు దరిదాపుల్లో మార్కులొచ్చాయి. ఫారినుకు వెళ్లే అవకాశాలు బోలెడు వచ్చినా మన దేశం విడిచి ఎక్కడికీ వెళ్లకూడదనేది ఆమె సిద్ధాంతమట. కాదంటే ఇక్కడ ఒక చిన్న ఇబ్బంది ఉంది. అమ్మాయి పుట్టిన దగ్గర్నుంచీ ఇప్పటిదాకా వంటింటి ఛాయలకు వెళ్లలేదు. వంట గదంటే అదేదో ఫారిననుకుంటుంది. అందువల్ల తన సిద్ధాంతాలరీత్యా ఫారినుకు వెళ్లదు. కాబట్టి వంటా వార్పులకు సంబంధించి మార్కులు జీరో. మిగతా విషయాల్లో హీరో...యిన్..మ్" అంటూ వాక్యం పూర్తి చేశాడు శాస్త్రి.

"దాందేముంది శాస్త్రులుగారూ. ఇద్దరి మధ్య ప్రేమ పుట్టాలే గానీ వివాహ బంధం తమకు రాని పనులన్నీ చేయిస్తుంది. మగవాడి చేత బట్టలుతికి, అంట్లు తోమి, వంట చేయిస్తుంది. ఆడాళ్ల చేత బైకు నడపడం కూడా చేయిస్తుంది. చివరాఖరికి నీ కోసం నేనేమైనా చేస్తాను, ప్రాణమైనా ఇస్తాను అనేందుకు బదులుగా ఈ అమ్మాయి వంటైనా చేస్తాను అంటుంది అంతే కదా. ఐనా నేనున్నంతకాలం ఆ అమ్మాయి వంట గురించి ఎందుకు దిగులు పడాలి?"

"ఆ మాటన్నారు బాగుంది. ఇంత మంచి అత్తగారిని ఏ కోడలు వద్దంటుంది? వచ్చేవారమే అమ్మాయి ఫోటో జాతకంతో సహా మీ ముందుంటాను"

"ఐతే ఇక్కడ మరో సమస్య ఉంది. వాడు పెళ్లంటేనే సుముఖంగా లేడు. వాణ్నెలా ఒప్పించాలో తెలియడం లేదు. పోనీ వాడి మనసులో వేరే ఎవరైనా ఉన్నారా అంటే అదీ లేదంటాడు"

"అదెంత పని. వెయ్యిబద్ధాలాడి ఒక పెళ్లి చేయమన్నారు గదా. వెయ్యక్కర్లేదు. ఒక్కటంటే ఒక్కటి చాలు. దాని సంగతి నేను చూసుకుంటాను. అబ్బాయిని పిలవండి"

"ఊళ్లో లేడు. మరో రెణ్నెళ్లు పడుతుంది రావడానికి"

కొద్దిగా ఆలోచించి "అబ్బాయి ఎక్కడున్నాడో అడ్రసివ్వండి. నేను అక్కడికే వెళ్లి కలుస్తాను. ఆలస్యం అమృతం విషం"

"వెళ్లింది చెన్నై. ఉండేదెక్కడో తెలీదు. అతని సెల్ నెంబరు రాసుకోండి. దాంతో వాడెక్కడున్నా కనుక్కోవచ్చు"

"అదీ నిజమే. ఇదుగో. నేనివాళే బయలుదేరుతాను. మరిక సెలవు" అంటూ ఆమె ఇచ్చిన సెల్ నెంబరు రాసుకుని శాస్త్రి అక్కణ్నుంచి బయటపడ్డాడు.

వర్ధని తృప్తిగా తలాడించి లోపలికి వెళ్లింది. తనకు ఐదు వందల మైళ్ల దూరంలో ఉన్న కొడుకును తలుచుకుని చిన్నగా నిట్టూర్చింది. 'పిచ్చి సన్నాసి ఏం చేస్తున్నాడో ఏమో. సరిగ్గా తింటున్నాడో లేదో. హోటల్ తిండి ఎలా ఉందో ఏమో' అనుకుంటూ నిస్సత్తువగా సోఫాలో కూలబడింది.

* * *

"హోటలా. ఆ పదమే నాకు గిట్టదు. అందునా ఊరుకాని ఊర్లో. కందమూలాలు తిని బతికేస్తాను గానీ వాటి జోలికెళ్లను" అంటూ చేతిలోని గిన్నెను గాల్లోకి ఎగరేసి పట్టుకున్నాడు వేణు.

"అలా అనకు. ఇక్కడి ఉడిపి భవన్ ఎంత ఫేమసో నీకు తెలీదు. శుచీ శుభ్రతకు మారు పేరు. ఈ విషయంలో మాత్రం నీక్కాబోయే భార్య నిజంగానే అదృష్టవంతురాలు రా" అన్నాడు స్నేహితుడు మాధవ.

ఆఫీసు పని మీద రెండు నెలల డెప్యుటేషన్‌పై చెన్నై వచ్చాడు. అతనితోటే అతని కొలీగ్ కం ఫ్రెండ్ మాధవ కూడా వచ్చాడు. వచ్చిన రోజే కష్టపడి వెదికి ఒక చిన్న గది అద్దెకు సంపాదించారు. అందుక్కారణం స్వయం పాకమే. మరి రెండు నెలలు ఉండాలి గదా.

చిన్నప్పట్నుంచీ తల్లి కొంగు పట్టుకు తిరిగిన వేణు ఆ సమయమంతా వృధా చెయ్యకుండా వంటలోని మెళకువలన్నీ చెప్పకుండానే నేర్చుకున్నాడు ఏకలవ్యుడిలా. అన్నంలో పొడి చేయడం దగ్గర్నుంచీ ఆవకాయ పెట్టడం వరకూ అతనికి అందె వేసిన చెయ్యి. వంట చేయడం ఒక పనిగా కాక హాబీగా చేస్తాడు.

మాటల్లోనే అతని సెల్ మోగింది. చూస్తే న్యూకాల్ అని ఉంది. సాధారణంగా అతను న్యూకాల్ అటెండ్ చేయడానికి ఇష్టపడడు. వెంటనే ఆఫ్ బటన్ నొక్కేశాడు. కేవలం ఒకే నిముషం వ్యవధిలో మళ్లీ మోగింది. మళ్లీ ఆఫ్ బటన్ నొక్కేశాడు. ఐతే సెల్ మళ్లీ మూడోసారి మోగింది.

కాస్తంత అసహనంతో ఈసారి జవాబిచ్చాడు వేణు "హలో" అంటూ.

"హలో. వేణూయేనా. నమస్కారం బాబూ. నా పేరు శాస్త్రి. హైదరాబాద్ నుంచి వచ్చాను. మీ అమ్మగారినడిగి నెంబరు తీసుకుని ఫోన్ చేస్తున్నాను. ఎలా ఉన్నావో కళ్లారా చూసి రమ్మంది. నువ్వెక్కడున్నావో కాస్త చెబితే వచ్చి కలుస్తాను" అన్నాడు గబగబా శాస్త్రి.

ఒక్క నిముషం సెల్ వంక చూసి చిన్నగా నిట్టూర్చి 'వచ్చి ఇంకా రెండ్రోజులైనా కాలేదు. అంతలోనే బెంగా?' అనుకుంటూ తనుండే ఏరియా అడ్రసిచ్చాడు వేణు.

మరుక్షణం అల్లాఉద్దీన్ అద్భుతదీపంలోని భూతంలాగా ఠక్కున అతని ముందు ప్రత్యక్షమయ్యాడు శాస్త్రి.

"మ్ ఏంటీ సమాచారం? నేనొచ్చి ఇంకా రెండ్రోజులైనా కాలేదు. అంతలోనే నాకేమౌతుంది?"

"ముందుగా నేను కూర్చుంటాను" అంటూ లోపలికి వచ్చి అక్కడున్న సోఫాలో కూర్చున్నాడు శాస్త్రి.

"అబ్బాయ్. నీ గురించి ఏమీ బెంగలేదు. కానీ నువ్వు పెళ్లి చేసుకోవడం లేదనే బెంగపడుతూంది. అంతే."

"దాని కోసమా మీరొచ్చింది. నా పెళ్లి, నా యిష్టం."

"చూడుబాబూ. నువ్విలా ఊళ్లూ అగ్రహారాలూ పట్టుకుతిరుగుతూ ఉంటే అక్కడ ఈ వయసులో ఒంటరిగా మీ అమ్మ కష్టపడతారు. ఆమెకెవరో ఒకరు తోడు కావాలి గదా?"

"అందుకు నా పెళ్లొక్కటే మార్గమా?"

"అంతే మరి. పనికి మనుషులను కుదుర్చుకుంటే వాళ్లు జీతానికేగా ఉంటారు. పెళ్లంటే జీవితం కోసం ఉంటారు" తనేదో గొప్ప డైలాగు చెప్పినట్టు ఉబ్బిపోయాడు శాస్త్రి.

తల అడ్డంగా ఊపాడు వేణు.

"ఊ. అలా అనకూడదు. ఇంకో మాట చెప్పు" అంటూ మూలిగాడు శాస్త్రి.

**ఆంధ్రభూమి దిన పత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన రచన**

"అరే. ఇదేం కూరగాయల బేరమా?"

"ఊహూ. నేనొప్పుకోను. నా మాట విను. అమ్మాయి జగన్మోహిని"

వెంటనే ఉలికి పడ్డాడు వేణు.

జగన్మోహిని అంటే అసాధారణమైన అందం అని అర్థం వస్తుంది. కానీ ఆదేంటో చిన్నప్పట్నుంచి ఆ పేరు వింటే కేవలం ఒక పిశాచి మాత్రమే, అదీ రెండు కాళ్లు పొయ్యిలో పెట్టి వంట చేస్తూ ఉన్న ఫోజులో గుర్తుకొస్తుంది వేణుకు. అతని మనసులో అంతటి ప్రగాఢమైన ప్రభావాన్ని వేసిందా సినిమా.

అదే మాట బయటికి అన్నాడు "అంటే పొట్టిగా, తెల్లగా పాలిపోయి, గుంట కళ్లతో, ముక్కే లేకుండా, రెండు కాళ్లు పొయ్యిలో పెట్టి వంట చేస్తుందే, అలా ఉంటుందా."

అతని ఆలోచనకు ఉలికిపడ్డాడు శాస్త్రి.

"ఉష్. జగన్మోహిని అంటే ఆ సినిమా జగన్మోహిని కాదు. ఒరిజినల్ స్వర్గలోకపు జగన్మోహిని. అ..ల..వి..గా...ని... అందం" అంటూ సాగదీశాడు.

ఆ వెంటనే శాస్త్రికి మరో ఐడియా వచ్చింది.

వేణు భుజం మీదుగా వెనక్కి చూసి "ఓహ్. స్వయం పాకం! మరో ముఖ్యమైన విషయం. అసలు వంట గురించి నువ్వేమీ దిగులే పడక్ఖర్లేదు. చేతులు కాల్చుకోనక్ఖర్లేదు. నలభీమ పాకాలన్నారు కానీ, అసలు వాళ్లు వంట చేసేటప్పుడు దమయంతీ ద్రౌపదీ చాటంగా నిలబడి ఎలా చేయాలో చిట్కాలందించారట తెలుసా."

"అలాగని మీకెవరు చెప్పారో. ఐనా అవన్నీ నాకనవసరం. నేను వంట దివ్యంగా చేయగల్ను."

"ఆహా! మేడ్ ఫర్ ఈచదర్ అంటే ఇదేనేమో. వంట విషయంలో ఇద్దరూ ఇద్దరే. ఒక పని చెయ్. పెళ్లయ్యాక మీరిద్దరూ ఒకరికొకరు సహాయం చేసుకోండి. నీకు వచ్చిన వంటలన్నీ ఆమెకు నేర్పెయ్. తనకు రాని వంటలన్నీ నీ దగ్గర నేర్చుకుంటుంది. దాంతో మీ వంటిల్లు ఒక చిన్న ఉడిపి భవన్ ఐపోతుంది."

అతని మాటలూ అర్థం అయీ కానట్టుగా ఉంది వేణుకు. తనకు వచ్చినవి ఆమెకు నేర్పడం ఓకే. ఆ తరువాత మాటే అర్థం కాలేదు. తను విన్నదేమిటో అంతలోనే మర్చిపోయాడు. ఏదైతేనేం, వంట బాగా వస్తుంది అంటున్నాడు కాబట్టి, అమ్మకు సహాయంగానైనా ఉంటుంది అనుకున్నాడు. కానీ వెంటనే సమ్మతించలేదు.


"నేనిప్పుడు పని మీద వచ్చాను. మరో రెణ్ణెళ్ల తరువాతే ఏదైనా ఆలోచిస్తాను."

"ఆహా. పిల్లాడు తల్లి సెంటిమెంటు కన్నా వంట సెంటిమెంటుకే కట్టుబడేట్టున్నాడు. దీన్నిలాగే కంటిన్యూ చెయ్యాలి. ఇదే టెక్నిక్కుతో వీణ్ణి గంప కింద కోడిలా అదిమెయ్యాలి" అని మనసులో అనుకుని "ముందు చూపులకు సిద్ధమైపో. చూసిన తరువాత ఆలోచించు" అన్నాడు.

"అలాగేలే. అమ్మాయిని చూసి టెస్ట్ చేసి, ఆ తరువాతే ఓకే చేస్తాను. నేను చెప్పిన వంటలన్నీ వండి చూపిన తరువాతే పెళ్లి. లేదంటే అవన్నీ నేర్చుకున్న తరువాతే" అన్నాడు.

"ఆ ఒక్ఖ మాట మీద నిలబడు. మిగతా సమాచారం నేను చూసుకుంటాను. ఆ రోజున ఉడిపి భవనే నీ ముందుంచుతా" అనేసి గబుక్కున నాలుక్కరుచుకున్నాడు. 'టెస్టింగ్ టైంలో ఉడిపి భవన్‌కు ఆర్డరిద్దామనుకున్నా. కొంపదీసి మనసులో మాట పసిగట్టేసి ఉంటాడా" అనుకుని అంతలోకే సర్దుకున్నాడు.

పెళ్లి చూపుల్లో బొమ్మలు వంట చేసి అమ్మాయే చేసిందని చెప్పడం, హోటల్ నుంచి తెప్పించి అమ్మాయే చేసిందని చెప్పడం పాత టెక్నిక్కులే ఐనా బాగా వాడుకలో



ఉన్న టెక్నిక్కులు. అచ్చొచ్చిన టెక్నిక్కులు. కాబట్టి ఎన్నిసార్లైనా వాడుకోవచ్చన్న మొండి ధైర్యం. మూడు ముళ్లు పడేవరకే. పడ్డ తరువాత మరింకేం చేయలేరన్న ధీమా శాస్త్రికి.

వేణు అదోలా చూశాడు శాస్త్రి వైపు. శాస్త్రి దొంగ చూపులు చూస్తూ అక్కణ్నుంచి ఒక్కంగలో బయటపడ్డాడు.

★ ★ ★

మౌనిక వచ్చి కూర్చోగానే ఆమెను చూసిన వేణు పరవశించిపోయి శాస్త్రి వైపు తిరిగి "శాస్త్రీ. ఈ అమ్మాయి జగన్మోహినా?" అన్నాడు.

"మరేనండీ. ఏం అందంగా లేదా?"


"నీ మొహం. నేనేమన్నాను. జగన్మోహిని అంటే నా ఉద్దేశ్యంలో కేవలం ఒక పిశాచి. ఇలాంటి అమ్మాయిల్ని వర్ణించాలంటే మాధురీదీక్షిత్ అనో మనీషాకొయిరాలా అనో చెప్పు" అన్నాడు మెల్లగా పళ్లు కొరుకుతూ.

"చిత్తం" అంటూ వెనక్కు తగ్గాడు శాస్త్రి. కాస్సేపటికి భోజనాలయ్యాయి.

భోజనాల వద్ద శాస్త్రి మళ్లీ గొంతు విప్పాడు.

## కవయిత్రి యానా గుప్తా

'బాబూజీ జరా ధీరే చలో' అనే ఐటమ్ నంబర్‌తో యావత్ హిందీ ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించి, దక్షిణాది భాషల్లో సైతం క్రేజ్‌ని సంపాదించుకున్న చెకోస్లావేకియా సుందరి యానా గుప్తా ఇప్పుడు కవయిత్రిగా కూడా మారింది. తనే సొంతంగా రాసిన కొన్ని పాటలతో కూడిన ఆల్బమ్‌ని విడుదల చేసింది. యుకెలో సెటిల్ అయిన ఓ పంజాబీ గాయకుడితో కలిసి యానా ఈ ఆల్బమ్ చేసింది. త్వరలో తను ఔట్ అండ్ ఔట్ మ్యూజికల్ సినిమా చేయబోతున్నానంటోంది యానా.



"వంట విషయంలో అమ్మాయి సాక్షాత్తూ అన్నపూర్ణ అనుకోండి. ఆమె చేతి వంట అమృత తుల్యం అంటే అతిశయోక్తి కాదేమో" అన్నాడు.

మౌనిక ఉలిక్కిపడింది. శాస్త్రి వైపు అయోమయంగా, గుర్రుగా చూసింది. నువ్వు సైలెంట్‌గా ఉండు అన్నట్టు కళ్లతోనే సైగచేసి తన పొగడ్తల పరంపర సాగనిచ్చాడు. ఆమెకు కోపం నషాళానికంటింది.

"ఇది పొగడ్త కాదు బాబూ. అక్షర సత్యం. నాక్కొన్త తిండియావ ఎక్కువ. అందువల్ల నేనీ ఇంటి ఆస్థాన పురోహితుడిగా స్థిరపడిపోయాను. అప్పుడప్పుడూ అమ్మాయి చేతి వంట తినకుంటే నాలుక మొద్దుబారి పోతుంది."

మౌనికకు అంతకంతకూ శాస్త్రి మీద కోపం పెరిగిపోసాగింది.

భోజనం ముగించి చేతులు కడుక్కున్న తరువాత "నిజంగా వంట చాలా అద్భుతంగా ఉంది. ఉండే కడుపు చాలా చిన్నది. లేకుంటే మొత్తం లోపలికి తోసేవాడినే. ఐటమ్సన్నీ చాలా బాగున్నాయి. ఇంకా మీకు రాని వంటలేవైనా ఉంటే చెప్పండి. నేను నేర్పుతాను" అన్నాడు వేణు తన్మయత్వంతో.

"నాకు వంట రాదు. నేర్పిస్తారా?" అన్న మాటలు వినబడ్డాయి.

ఉలికిపడి ఆ మాటలు వినబడ్డవైపు చూశాడు వేణు. ఎదురుగా ఉన్న సౌమ్య భృకుటి ముడివేసి వేణు వెనకవైపు తీక్షణంగా చూస్తున్న ఫీలింగ్ కలిగింది.

కూర్చున్న పళంగానే ఠక్కున వెనుదిరిగి చూశాడు వేణు. వెనుక నిలబడి ఉన్న శాస్త్రి నోటికి చెయ్యడ్డం పెడుతూ చెయ్యి అడ్డంగా ఊపుతూ నానా అవస్థలూ పడుతున్నాడు.

"చూడండీ. ఈయన మీతో ఏం చెప్పాడో నాకు తెలీదు. వెయ్యబద్ధాలాడి ఒక పెళ్లి చేయడమనేది పాత కాలం నాటి సామెత. ఈ కాలానికది వర్తించదు. ఒక్క బద్ధమాడినా జీవితమే నరకమవుతుంది. నాకు నిజంగానే వంట చేయడం తెలీదు. అగ్గిపుల్ల గీకడం కూడా రాదు. అసలు మా ఇంట్లో వంటగదెక్కడుందో కూడా నాకు తెలీదు. ఇప్పుడు మీరు తిన్నదంతా ఉడిపి భవన్ వంటకాలు"

వేణుకు లీలగా అతనన్న మాటలు గుర్తుకొచ్చాయి. "ఆ రోజున ఉడిపి భవనే నీ ముందుంచుతాను"

ఈసారి దిగ్గున లేచి గిరుక్కున వెనక్కు తిరిగాడు. శాస్త్రి మెల్లగా వణకడం ప్రారంభించాడు.

"ఎందుకలా అబద్ధం చెప్పావు?" అంటూ తీక్షణంగా చూశాడు వేణు.

శాస్త్రి నీళ్లు నమలసాగాడు. అంతలో వేణు తల్లి కలుగజేసుకుంది.

"ఇప్పుడేం కొంప మునిగిందని. వంట రాకపోతే ఏంటట? అదేమంత పెద్ద సమస్యా? నేనున్నానుగా. నిదానంగానే నేర్చుకుంటుంది. ఒకవేళ అసలు వంటింటి ఛాయలకే రానంటుందా. మరేం ఫరవా లేదు. బతికినంత కాలం పిల్లలకు వండిపెట్టే అదృష్టం ఎంత మంది తండ్రులకు కలుగుతుంది. ఈ కాలంలో చాలా మంది పిల్లలు కన్నవాళ్లను వృద్ధాశ్రమంలో చేర్చేవాళ్లే గానీ తమతో ఉంచుకునేవాళ్లు ఎంత మంది? కనీసం వండి వార్చడం కోసమైనా నా బిడ్డల దగ్గర నేనుంటాను" అన్నది. ఆ మాటలకు మౌనిక చలించిపోయింది.

"అయ్యో. నా ఉద్దేశ్యం అది కాదండి. ఏ దాపరికాలూ ఉండకూడదనే అలా అన్నాను. లేనిపోనివి ఊహించుకుని రేపు మళ్లీ మీ అబ్బాయి నిరాశ చెందకూడదు గదా"

"అదీ నిజమే. ఇంత నిజాయితీగా నువ్వు ఉన్న విషయాన్ని ఉన్నట్టుగా చెప్పడంలోనే ఉంది నీ గొప్పతనం. ప్రపంచంలో మంచితనాన్ని మించిన గుణం ఏది? ఈ ఒక్క వంట రాదన్న విషయం కోసం మిగతా ఎన్నో విషయాల్లో ఎంతో గొప్పగా ఉన్న నిన్ను కాదనుకోవడంలో ఔచిత్యం కనబడలేదు" అన్నది.

"నిజంగానే నాకు వంట రాదు. ఐతే ఇప్పుడు మీరు మాట్లాడే మాటల వల్ల సాధ్యమైనంత త్వరలో నేర్చుకోవాలనిపిస్తూంది. కావాలంటే ఆ తరువాతే పెళ్లి జరపండి"

"అబ్బాయి కండిషన్ కూడా అదేనమ్మా" అన్నాడు శాస్త్రి కలుగజేసుకుని.

"ష్. నువ్వేం మాట్లాడకు. ఇలా అబద్ధం చెప్పినందుకు నీ ఫీజులో సగం కట్"

"బాబూ క్షమించండి. మీ వంట వీక్నెస్‌ను క్యాష్ చేసుకుందామనుకుంటే అసలు వచ్చే క్యాష్ కూడా పోయేలాగుంది. ఇకమీద నో అబద్ధం. ఆల్వేస్ ఓన్లీ నిజం. పెళ్లి ఐతే అవుతుంది లేకపోతే మరో సమ్మంధం" అన్నాడు దీనంగా ముఖం పెట్టి.

★ ★ ★

పెళ్లయిన వారం తరువాత అతను నేర్పడం ఆమె నేర్చుకోవడం, షరా మామూలే. కాదంటే 'స్టార్ట్ ఫ్రం ద స్క్రాచ్' అన్నట్టుగా అక్షరాలా అగ్గిపుల్ల గీకడం దగ్గర్నుంచీ అన్నీ నేర్పాల్సి వచ్చింది. అదో సరదా, సరసం!

☆